# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 29 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రభుత్వం సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే నినాదంతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణాలపై ఈ మధ్యాహ్నం సమీక్ష నిర్వహిస్తారు.**
3. **బాలబాలికలు నేర్చుకునే విద్య, విజ్ఞానం మాతృభాషతో ముడిపడి ఉంటాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
4. **మత్స్యకారులకు ఆర్థికంగా, సామాజికంగా చేయూత అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి కె.అచ్చెనాయుడు తెలిపారు.**

-----------------------

కేంద్ర ప్రభుత్వం సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే నినాదంతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల రెండోరోజున న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన సముదాయంలో ప్రధానమంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ,

సంక్షేమ పథకాలను చివరి లబ్ధిదారుడి వరకు చేర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి రాబోయే 25 సంవత్సరాలు కీలకమని అన్నారు. దేశాభివృద్ధికి అవసరమైన సమస్యలపై ప్రజా ప్రతినిధులు చర్చించాలని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 25 సెకన్లు

-----------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణాలపై ఈ మధ్యాహ్నం సమీక్ష నిర్వహిస్తారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అనుసంధానతను మెరుగుపరచడం, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. అలాగే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులు వేగంగా పూర్తి చేయడానికి వివిధ శాఖల మధ్య సమన్వయంపై ముఖ్యమంత్రి చర్చిస్తారని అధికారులు తెలిపారు.

-----------------------

బాలబాలికలు నేర్చుకునే విద్య, విజ్ఞానం మాతృభాషతో ముడిపడి ఉంటాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని స్థానిక పాఠశాలలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన "బాలల ప్రపంచ తెలుగు మహాసభ"ల్లో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృభాషపై పట్టు ఇతర భాషలను సులభంగా నేర్చుకోవడానికి, మేధో వికాసానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కీలకమైన పునాదిగా పనిచేస్తుందన్నారు.

వాయిస్.. 31 సెకన్లు

-----------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన కింద నిర్మితమైన బెంబ్లా నీటిపారుదల ప్రాజెక్ట్ కూడా ఉంది. బెంబ్లా నీటిపారుదల ప్రాజెక్టు మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక కీలక నీటిపారుదల పథకం. 2007 ఏప్రిల్ 2న 2 వేల 685 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరైన ఈ ప్రాజెక్టు యవత్మాల్ జిల్లాలో బెంబ్లా నదిపై చేపట్టారు. ప్రాంతీయ నీటి భద్రత, రైతుల జీవనోపాధికి ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యతను గుర్తించి, ప్రగతి యంత్రాంగం కింద 2023 అక్టోబర్ 25న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమీక్షించారు. ఈ సందర్భంగా జాప్యానికి కారణమైన సమస్యలను సమన్వయంతో పరిష్కరించడానికి సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష ఫలితంగా, ప్రాజెక్టు వేగవంతమై 2025 జూన్ 30న ప్రారంభించబడింది. ఈ విధంగా ప్రగతి యంత్రాంగం పర్యవేక్షణ ఎలా పనిచేస్తుందో బెంబ్లా నీటిపారుదల ప్రాజెక్టు ఒక ఉదాహరణగా నిలిచింది.

----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకూ.. 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు" -స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత వాతావరణంపై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ, శ్రమదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

----------------------

చిన్నారులకు సంబంధించి సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిషేధించే అంశంపై అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు సూచించారు. సామాజిక మాధ్యమ జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది.
ఈ సమావేశంలో మంత్రులు కొలుసు పార్థసారథి, అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, నిర్ణీత వయసు ఉన్న మైనర్లను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు.

-----------------------

మత్స్యకారులకు ఆర్థికంగా, సామాజికంగా చేయూత అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి కె. అచ్చెనాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్, పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎస్ సవిత, కొల్లు రవీంద్రతో కలిసి ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి అచ్చెనాయుడు మాట్లాడుతూ,

వాయిస్.. 23 సెకన్లు

-----------------------

రాజధానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరిస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు గ్రామంలో నిర్మిస్తున్న పొట్టి శ్రీరాములు విగ్రహ పనులను సిఆర్డిఏ కమిషనర్ తో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు అనంతరం తుళ్లూరు గ్రామంలో మౌలిక సదుపాయాల నిర్మాణం

కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో ఈరోజు నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు 'అరకు ఫెస్ట్ ఉత్సవాలను' నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల నుంచి 400 మంది కళాకారులతో తప్పెటగుళ్లు, డప్పు వాద్యం, పులివేషాలతో పాటు గిరిజన సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ 4 రోజుల వేడుకల్లో, కాఫీ టూరిజం, ధింసా నృత్యాలు, పారాగ్లైడింగ్, హెలికాప్టర్ రైడ్స్, 5K మారథాన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

-----------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పార్లమెంటు సభ్యులు మొసలికంటి తిరుమలరావు జయంతి ఈరోజు. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించిన ఆయన... 1921లో జాతిపిత మహాత్మాగాంధీ పిలుపు నందుకొని సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఏడాది పాటు కఠిన శిక్ష విధించారు.

= = = = = = = = = = = = = = = = = = =